# గోల్కొండ కోట



గోల్కొండ, తానీషా రామదాసును బంధించిన కోట. ఇది హైదరాబాదుకు పశ్చిమంగా పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చారిత్రక దుర్గం. 1518-1687ల మధ్య ఈ ప్రాంతాన్ని ఏలిన కులీకుతుబ్ షాహీ రాజవంశీయులకు రాజప్రాసాదంగా ఉండిన గ్రానైట్ రాతి నిర్మాణం. కోట చుట్టుకొలత 11 కిలోమీటర్లు. 8 ద్వారాలూ, 70 బురుజులు గల ఈ కోట లోపల ఎత్తయిన కొండమీద రాజమహల్ ఉంది. ఈ కోట నిర్మాణంలో ఇమిడి ఉన్న ప్రతిధ్వని మాత్రం విశిష్టమైంది. క్రింద ప్రధాన గోపుర ద్వారం వద్ద చప్పట్లు కొడితే అవి సుమారు 60 మీటర్ల ఎత్తునున్న రాజమహల్‌లో వినబడుతాయి. అక్కడక్కడ ధ్వని తరంగాల్ని గ్రహించి మరల ప్రతిధ్వనించే సున్నిత స్ఫటికాలు పొదిగినట్లు చెబుతారు. మట్టిగొట్టాల ద్వారా పర్షియన్ చక్రాలు ఉపయోగించి నీటిని రాజమహలుకు ఎత్తిపోస్తూ శీతలీకరణం (ఎయిర్ కండీషనింగ్) ఏర్పాటు కూడా చేశారు.

రామదాసును తానీషా బంధించి ఉంచిన బందిఖానా భక్తులైన యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తూ ఉంటుంది.